సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 27 । ఆగస్టు । 2024



'ఆర్మీ' పరుగు ఆరంభం

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ సోమవారం ఆర్కే బీచ్‌లో ప్రారంభమైంది. వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా అభ్యర్థులు పరుగు పెట్టారు.



ఫార్మా బాధితుల ఆందోళన

సినర్జిన్ ప్రమాదంలో గాయపడి మృతిచెందిన బాధితులకు పరిహారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. 8లో

మహిళా పోలీసులతో భద్రత కల్పించాలి



రాత్రి వేళ విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర మహిళా సిబ్బందికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. మహిళా పోలీసుల ద్వారా వీరికి భద్రత కల్పించాలి. అలాగే డ్యూటీలో ఉన్న మహిళలకు ప్రత్యేక గదులు, ఇతర వసతులు కూడా ఉండాలి. రాత్రి సమయాల్లో ఆస్పత్రిలో గస్తీ మరింత పెంచాలి. కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి. ఆస్పత్రుల్లో రోగులను చూడడం కోసం వచ్చే వారికి ఒక టైమ్ కేటాయించాలి. స్థానిక పోలీసుల ఫోన్ నెంబర్లు, కంట్రోల్ రూమ్ నెంబర్లు ఆస్పత్రి అంతటా వేయాలి.

– డాక్టర్ కందేపల్లి శిల్ప, మెడికల్ అంకాలజీ విభాగాధిపతి, ఏఎంసీ

సహాయకులకు టైమ్ నిర్దేశించాలి



ఆస్పత్రుల్లో ప్రస్తుతం ఉన్న సదుపాయాలు సరిపోవడం లేదు. వీటిని ఇంకా పెంచాల్సిన అవసరం ఉంది. ఆస్పత్రిలో రోగిని పరామర్శించడానికి వచ్చే సహాయకులపై నియంత్రణ ఉండాలి. వీరికి సాయంత్రం 4 నుంచి 5 వరకు టైమ్‌ను నిర్ధారించాలి. ప్రధాన ద్వారం వద్ద ఏ రోగి తరఫున ఎవరు వస్తున్నారో తెలియజేసే విధంగా పాసులు రూపొందించాలి. ఇలాంటి చర్యల వల్ల రోగి సహాయకులు దాడి చేసినా వెంటనే గుర్తించే అవకాశం ఉంటుంది. మహిళా సిబ్బందికి పూర్తి స్థాయిలో భద్రత కల్పించాలి.

–డాక్టర్ రాపేటి ఊహ, జూనియర్ వైద్యుల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు, ఏఎంసీ

న్యూస్‌రీల్

విశాఖలో సినీ నటుడు రజినీకాంత్ సందడి



గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయంలో సినీ నటుడు రజినీకాంత్ సోమవారం సందడి చేశారు. విశాఖలో జరిగే షూటింగ్‌లో పాల్గొనేందుకు చెన్నై నుంచి వచ్చారు. విమానాశ్రయంలో ఆయన్ని చూడగానే అభిమానులు, ప్రయాణికులు కేరింతలు కొట్టారు. సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. అనంతరం ఆయన రాడిసన్ బ్లూ హోటల్‌కు బయలుదేరి వెళ్లారు.

ఆర్థిక సదస్సు ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

మహారాణిపేట: ఈ నెల 29వ తేదీన జరగనున్న ఆర్థిక వ్యవస్థ–అమలు విధానం సదస్సును అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం నొవాటెల్‌లో జరగనున్న సదస్సు ఏర్పాట్లను జేసీ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, ఆర్డీవో డి.హుస్సేన్‌సాహెబ్‌లతో కలిసి సోమవారం కలెక్టర్ పరిశీలించారు. సదస్సుకు పలు రాష్ట్రాల నుంచి ప్రముఖులు, ప్రతినిధులు, ఉన్నతాధికారులు విచ్చేస్తున్నందున ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు ఉండరాదని ఆదేశించారు. వారికి కేటాయించే వసతి, భోజనం, రవాణా సదుపాయాలు పక్కాగా ఉండాలని తెలిపారు. జీవీఎంసీ, రెవెన్యూ, పోలీస్, ఈపీడీసీఎల్, వైద్య తదితర విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

అద్భుతం ఈలపాట కచేరి



ఈల పాట కచేరి చేస్తున్న శివప్రసాద్

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా కర్ణాటక ఈల పాట కళాకారుడు డాక్టర్.కె.శివప్రసాద్ బృందం ప్రదర్శన ఆద్యంతం అలరించింది. కార్యక్రమాన్ని ఈస్ట్రన్ నేవల్ కమాండర్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఆఫీసర్ ఎం.మురళీ మోహన్, వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, కృష్ణప్రసాద్ ప్రారంభించారు. అనంతరం శివప్రసాద్ రెండు గంటల పాటు ఈల పాటతో అందరిని ఆకట్టుకున్నారు. వయోలిన్‌పై విద్వాన్ మావుడూరి సత్యనారాయణ శర్మ, మృదంగంపై రామకృష్ణ, తబలాపై గుణరంజన్, కీబోర్డుపై శ్రీలాల్ కృష్ణ సహకారం అందించారు.

ఏఎస్‌ఐ సస్పెన్షన్

మత్రిపాలెం: ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ సతీష్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఎంవీపీ కాలనీకి చెందిన ఓ బిల్డర్‌కు ఆయన వినియోగదారుడి మధ్య జరిగిన లావాదేవీల్లో ఏర్పడిన వివాదంలో సతీష్ దురుసుగా వ్యవహరించారని వాట్సాప్ ద్వారా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ చేసిన ఏసీపీ ఇచ్చిన నివేదిక ఆధారంగా సతీష్‌పై చర్యలు చేపట్టారు.

విమానం అత్యవసర ల్యాండింగ్

ప్రయాణికుడికి గుండెపోటు

గోపాలపట్నం: అగర్తల నుంచి బెంగళూరు వెళ్లే విమానం విశాఖ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. బెంగళూరు వెళుతున్న నారాయణ చంద్రగోస్ (62)కు గుండెపోటు రావడంతో విశాఖ విమానాశ్రయంలో సాయంత్రం 6.04 గంటలకు విమానాన్ని ల్యాండ్ చేశారు. వెంటనే అంబులెన్స్‌లో షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. చంద్రగోస్ బంగ్లాదేశ్‌కు చెందినవాడిగా తెలుస్తోంది.

విభజించి దోచేసి

జీవీఎంసీలో వింత టెండర్లు



- ఒకే పనిని రెండు మూడు భాగాలుగా విడగొట్టి టెండర్లు
- స్టాండింగ్ కమిటీ, కౌన్సిల్ పని లేకుండా పనులను అప్పగించేస్తున్న అధికారులు
- జోన్–3లో ఒకే వార్డులో ఒకే పనిని 3 భాగాలుగా విడగొట్టిన అధికారులు
- గాజువాకలో గెడ్డ ఆధునికీకరణ పనుల్లోనూ మతలబులు
- టెండర్ విడగొట్టి ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగింత

సాక్షి, విశాఖపట్నం/గాజువాక: సాధారణంగా ఒక పనిని ఒక కాంట్రాక్టుగా అప్పగిస్తారు. కానీ మహా విశాఖ నగర పాలక సంస్థలో మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. ఒక వీధిలో రోడ్డులో వేయాలంటే.. రోడ్డు నిర్మాణ పని ఒక ప్యాకేజీగా, దాన్ని ఆనుకొని కాలువ నిర్మాణ పని మరొక ప్యాకేజీగా, అదే రోడ్డుమీద స్పీడ్ బ్రేకర్స్ వేసే పనిని మరో ప్యాకేజీగా విభజించి అప్పనంగా కాంట్రాక్టర్లకు అప్పగించేస్తున్నారు. అలా విభజించి వర్క్‌లిస్తే తమకు కొన్ని పైసలు వస్తాయనే ధోరణిలో అధికారులు వ్యవహరిస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో నిత్యం కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు టెండర్లు పిలుస్తుంటారు. జీవీఎంసీ కమిషనర్ రూ.20 లక్షలలోపు పనులకు మాత్రమే అనుమతి ఇవ్వగలరు. స్టాండింగ్ కమిటీ రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షలలోపు పనులకు అనుమతులు ఇచ్చే అధికారం ఉంది. కౌన్సిల్‌లో రూ.50 లక్షలకు పైబడి జరిగే పనులకు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. రూ.10 కోట్ల పైబడి భారీ ప్రాజెక్టులు, పాలసీ అంశాలకు సంబంధించినవి ఏవైనా ఉంటే ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి స్టాండింగ్ కమిటీ సమావేశాలుగానీ, కౌన్సిల్ సమావేశాలుగానీ నిర్వహించలేదు. దీంతో కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక్కడే అధికారులు తమ హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తున్నారు.

వాళ్లొచ్చేలోగా.. చక్కబెట్టేద్దాం..



రూ.20 లక్షలకు పైగా ఉన్న పనులపై ఓ ఉన్నతాధికారి కన్ను పడింది. అయితే ఒకే ప్యాకేజీగా వాటిని టెండర్లు పిలిచే అవకాశాలు లేవు. అందుకే ఆ పనులను రెండు లేదా మూడు ప్యాకేజీలుగా అడ్డగోలుగా విభజించేశారు. ఒక ప్యాకేజీ కింద టెండర్లు పిలిస్తే వేసే అంచనా వ్యయం కంటే రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పైగా అంచనా వ్యయం పెంచేశారు. అదనంగా పెంచుకున్న సొమ్మంతా పంచుకునేందుకు కొత్త ఎత్తుగడ వేశారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు సమావేశమయ్యేలోగా ఈ తరహా పనులకు సంబంధించిన టెండర్లు చక్కబెట్టేయాలని సదరు ఉన్నతాధికారి సిబ్బందికి హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది.

ప్రతి పనినీ విడగొట్టేద్దాం..



ఇటీవలే స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరిగాయి. త్వరలో కౌన్సిల్ సమావేశాలు నిర్వహించేందుకూ సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ రెండూ జరిగితే ఆయా పనులను సభ్యుల దృష్టిలో పెట్టాల్సి ఉంటుంది. అందుకే అధికారులు తమ తెలివితేటలను వాడుతూ డివైడ్ చేసి దోచుకో పాలసీని అమలు చేస్తున్నారు. రూ.20 లక్షలకు పైబడి పనులేవైనా స్టాండింగ్ కమిటీకి వెళ్లిపోవాల్సిందే. అందుకే ఆ పనులను ప్యాకేజీలుగా విడగొట్టి తమ పబ్బం గడుపుకొనేందుకు యత్నిస్తున్నారు. ఇదంతా ఓ ఉన్నతాధికారి కనుసన్నల్లో జరుగుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.



వడ్లపూడి ప్రధాన గెడ్డ ఆధునికీకరణ పనులు

గెడ్డ ఆధునికీకరణ పనుల్లో మతలబేంటో.?

పారదర్శకంగానే టెండర్లంటూ వడ్లపూడిలో ఒక **గెడ్డ ఆధునికీకరణకు** సంబంధించిన టెండర్‌ను **ముక్కలు, చెక్కలు చేసి** ఒకే కాంట్రాక్టరుకు కట్టబెట్టారు. **ఏకంగా రూ.3.20** కోట్లకు సంబంధించిన **టెండరును ఏడు ముక్కలు**గా విభజించి వర్క్ ఆర్డర్‌ను ఖరారు చేశారు. 87వ వార్డు వడ్లపూడి ప్రధాన గెడ్డ ఆధునికీకరణ కోసం గతంలో ఈ టెండర్లను పిలిచారు. మొత్తం రూ.3.20 కోట్లతో చేపట్టనున్న ఈ పనుల కోసం టెండరును ఏడు ముక్కలుగా విభజించారు. వడ్లపూడి ప్రధాన రహదారిపై ఉన్న వంతెనకు పడమర వైపు గెడ్డను రూ.2 కోట్లతో ఆధునికీకరించాలని నిర్ణయించి కాంట్రాక్టరుకు వర్క్ ఆర్డర్‌ను ఖరారు చేశారు. అదే గెడ్డకు సంబంధించిన వంతెనకు తూర్పువైపు ఉన్న భాగంలో రూ.1.20 కోట్లతో చేపట్టనున్న పనులకు టెండరును ఆరు ప్యాకేజీలుగా విడదీశారు. ఒక్క ఫైల్‌కు రూ.20 లక్షల చొప్పున నిర్ణయించి మొత్తం టెండర్‌ను ఒకే కాంట్రాక్టరుకు అప్పగించేశారు. అంతే కాదు ఈ గెడ్డను 18 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేసేందుకు గతంలో రూపొందించిన ప్లాన్‌ను మార్చేసి.. కాంట్రాక్టర్‌కు ఆర్థిక భారం తగ్గించాలనే ఉద్దేశంతో ఇప్పుడు 14 అడుగుల (4.7 మీటర్లు)కు కుదించేశారు. అదేవిధంగా గెడ్డను ఆనుకొని ఓ ప్రైవేట్ స్థలంలో కమర్షియల్ భవనం ఉంది. దానికి కొంత ఖాళీ జాగా అవసరమవ్వడంతో ఇంజినీరింగ్ అధికారులు ఇటు కాంట్రాక్టర్‌పైనా అటు ఆ వ్యక్తిపైగా అవ్యాజ ప్రేమ కురిపించేసి గెడ్డ వెడల్పును తగ్గించేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీని వెనుక రూ.లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి.

విభజించినా ఒకే కాంట్రాక్టర్‌కు..


పోనీ టెండర్లు ప్యాకేజీలుగా విభజించి.. వేర్వేరు కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారా అంటే అది జరగడం లేదు. ఎన్ని ప్యాకేజీలుగా విడగొట్టినా ఒకే ఒక్క కాంట్రాక్టర్‌కే అన్ని ప్యాకేజీల టెండర్లు వెళ్లిపోతున్నాయి. గెడ్డలు, రోడ్లు, డ్రెయిన్లు, స్పీడ్ బ్రేకర్లు, సైన్ బోర్డులు.. ఇలా ఏ కాంట్రాక్ట్ అయినా తాము అనుకున్న కాంట్రాక్టర్‌కే టెండర్లు వెళ్లేలా నిబంధనల్లో మెలికలు పెట్టేశారు. అందుకే టెండర్లు ఎన్నైనా కాంట్రాక్టు మాత్రం ఒక్కరికే వెళ్లడం గమనార్హం. ఇలా అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లలో జీవీఎంసీ అధికారుల మతలబులు ఒక్కోసారి ఎవరికీ అర్థం కావడంలేదు.

విభజించిన టెండర్లలో మచ్చుకు కొన్ని

- జోన్–8 పరిధిలో బీఆర్‌టీఎస్ నుంచి పెందుర్తి రైల్వే స్టేషన్‌కు హాట్‌మిక్స్ రోడ్, డ్రైన్స్ వేసేందుకు ఒక టెండరు రూ.21 లక్షలతో వేయాలి. కానీ హాట్ మిక్స్ రోడ్డుకు రూ.6,33,894, మరుగు నీటి కాలువకు రూ.16,60,698 గా విభజించి దాదాపు రూ.2 లక్షల అదనపు వ్యయంతో టెండర్లు పిలిచారు.
- జోన్–4 పరిధిలోని తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై బీటీ లేయర్, స్పీడ్ బ్రేకర్స్, సైన్ బోర్డుల ఏర్పాటు మొదలైన పనుల్ని ఒకే ప్యాకేజీలో నిర్వహించాలి. కానీ బీటీ లేయర్ కరెక్షన్ పనులకు రూ.3,45,221, స్పీడ్ బ్రేకర్స్, సైన్ బోర్డు ఏర్పాటు పనులకు రూ.3,77,514 చొప్పున రెండు ప్యాకేజీలుగా విడగొట్టేశారు.
- జోన్–3 పరిధిలో 17,18,19, 20,21, 26,27 వార్డుల్లో వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ సైన్‌బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.25 లక్షల సింగిల్ ప్యాకేజీపై టెండరు పిలవాల్సి ఉంది. కానీ నాలుగు ప్యాకేజీలుగా విభజించి రూ.28 లక్షలతో టెండర్లు పిలిచారు.
- జోన్–3 పరిధిలో 14,15,16, 23,24,25 వార్డుల్లో వివిధ ప్రాంతాల్లో రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్‌బ్రేకర్లు వేసే పనులకు రూ.34 లక్షల ప్యాకేజీతో పనులకు ఆహ్వానించాలి. కానీ తమ సౌలభ్యం కోసం మూడు భాగాలుగా విడగొట్టి రూ.38 లక్షలకు టెండర్లు పిలిచేశారు.
- జోన్–5 పరిధిలో కూర్మనపాలెం నుంచి అగనంపూడి వరకూ ప్రధాన రహదారిపై సెంట్రల్ మీడియన్‌లో పెయింటింగ్, ఎంఎస్ గ్రిల్స్ ఏర్పాటు చేసేందుకు గతంలో ఒకే కాంట్రాక్టు కింద పనిని అప్పగించారు. ఇప్పుడూ అదే తరహాలో టెండరు పిలిస్తే రూ.70 లక్షల నుంచి రూ.75 లక్షల అంచనా వ్యయం అవుతుంది. కానీ.. తమ దోచుకునే పాలసీ కోసం ఈ పనిని మొత్తం ఐదు రీచ్‌లుగా విభజించేశారు. రీచ్–1 నుంచి రీచ్–5 వరకూ 5 వర్క్‌లుగా విడగొట్టి ఒక్కో రీచ్ పనిని రూ.16.5 లక్షలుగా విభజించి టెండర్లు పిలిచేశారు. ఈ లెక్కన అదనంగా రూ.10 లక్షల వరకూ టెండరు వ్యయం పెంచేసి.. తమ జేబులు నింపేసుకునేందుకు స్కెచ్ సిద్ధం చేశారు.

ఇక్కడే ఉంటాం.. కాస్త చూడండి !

- ఎమ్మెల్యేల చుట్టూ జీవీఎంసీ జోనల్ కమిషనర్ల ప్రదక్షిణలు
- ఇప్పటికే కూటమి ఎమ్మెల్యేలతో బేరసారాలు
- సిఫార్సు లెటర్‌కి రూ.10 లక్షలకు పైగా డిమాండ్
- చెల్లింపులు పూర్తయిన వారికి లెటర్లు ఇచ్చేసిన ఓ టీడీపీ ఎమ్మెల్యే
- విజయవాడలో ప్రదక్షిణలు చేస్తున్న ఓ మహిళా జెడ్సీ



సాక్షి, విశాఖపట్నం: కల్పవృక్షం లాంటి కార్పొరేషన్ వదిలి వెళ్లేందుకు జోనల్ కమిషనర్లు ససేమిరా అంటున్నారు. ఆ కుర్చీని కాపాడుకునేందుకు ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలోనే నిమగ్నమయ్యారు. బదిలీల ప్రక్రియ దగ్గరపడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యేల సిఫార్సు లెటర్ల కోసం బేరసారాలాడుతున్నారు. ఇదే అదనుగా కూటమి ఎమ్మెల్యేలు.. తమ వద్దకు వస్తున్న జోనల్ కమిషనర్లకు ఆఫర్లు ఇస్తున్నారు. క్యాష్ కొట్టు.. సిఫార్సు లెటర్ పట్టు.. ఎవరు ఎక్కువ ఇస్తే.. వారికే లెటర్ అంటూ డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే చెల్లింపులు పూర్తి చేసిన వారికి లెటర్లు కూడా అందించినట్లు తెలుస్తోంది. జీవీఎంసీలో నిత్యం కోట్లాది రూపాయల సాధారణ పనులు జరుగుతుంటాయి. దీనికి తోడు స్మార్ట్‌సిటీ, స్పెషల్ గ్రాంట్, వరల్డ్ బ్యాంక్ నిధులు.. ఇలా చాలా పథకాలతో నగరాన్ని స్మార్ట్‌గా తీర్చిదిద్దేలా ప్రాజెక్టులు నడుస్తున్నాయి. పనులను జోనల్స్ వారీగానూ విభజించి.. ఆ బాధ్యతలను ఆయా జోనల్ కమిషనర్లకు పర్యవేక్షిస్తుంటారు. గ్రేటర్ పరిధిలో మొత్తం 8 జోన్లు ఉన్నాయి. ప్రతి జోన్‌కు హెడ్‌గా జోనల్ కమిషనర్ వ్యవహరిస్తున్నారు. ఆ జోన్‌లో జరిగే ప్రతి వ్యవహారం ప్రధాన కమిషనర్ వరకు తీసుకురాకుండా జోనల్ కమిషనర్ పరిష్కరించే అవకాశం కూడా ఉంది. అందుకే ఈ జెడ్సీ కుర్చీకి డిమాండ్ పెరుగుతోంది. ఇటీవల ప్రభుత్వం ఐదేళ్లు పూర్తయిన వారికి బదిలీ చేస్తామని చెప్పడంతో జెడ్సీలు అలెర్ట్ అయ్యారు. బంగారుబాతు లాంటి జెడ్సీ కుర్చీని వదిలి వెళ్లేందుకు అయిష్టత ప్రదర్శిస్తున్నారు. ఎలాగైనా జీవీఎంసీ పరిధిలోనే ఉండేందుకు బదిలీ లిస్టులో తమ పేరు లేకుండా చూసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

సిఫార్సు లెటర్లకు రూ.10 లక్షలకు పైగా...

అవసరమైతే జోన్ నుంచి మరో జోన్‌కు బదిలీ అవుతామే తప్ప విశాఖ నుంచి కదిలే ప్రసక్తే లేదని జోనల్ కమిషనర్లు భీష్మించుక్కూర్చున్నారు. బదిలీ ఆపేసుకునేందుకు సిఫార్సు లెటర్లు తీసుకొస్తే పని అవుతుందని మున్సిపల్ మంత్రి కార్యాలయం లీకులివ్వడంతో ఆ లెటర్స్ కోసం పోటీ పడుతున్నారు. తమ పరిధిలోని ఎమ్మెల్యేలతో మంతనాలు చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యేలతో బేరసారాలాడుతున్నారు. ఎంతైనా ఇస్తాం.. ఇక్కడి నుంచి వెళ్లకుండా చూడండి సార్ అంటూ ప్రాధేయపడుతున్నారు. ఇదే అదనుగా కూటమి ఎమ్మెల్యేలు.. లెటర్ కావాలంటే ఎంతిస్తారు? అని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఎంత మంది లెటర్లతో వస్తే అంత స్ట్రాంగ్‌గా ఉంటుందని భావిస్తున్న జోనల్ కమిషనర్లు.. ముగ్గురు నలుగురు ఎమ్మెల్యేలతో బేరాలాడుతున్నారు. ఫలానా జెడ్సీ ఆల్రెడీ రూ.10 లక్షలు ఇస్తానని చెప్పి వెళ్లారే.. మరి మీకు సిఫార్స్ చేయాలంటే దానికంటే బరువు ఎక్కువగా ఉండాలి కదా.. అని ఎమ్మెల్యేలే స్వయంగా అడుగుతుండటం గమనార్హం. దీనికి జెడ్సీలు ఏమాత్రం తగ్గకుండా.. నేను రూ.15 ఇస్తాను సర్.. ఆ లెటర్ నాకే ఇవ్వండి అంటూ బేరం తెగ్గొట్టేస్తున్నారని తెలుస్తోంది. ఇలా ప్రతి జెడ్సీ ముగ్గురు ఎమ్మెల్యేలకు దాదాపు రూ.50 లక్షలు వరకూ ఖర్చు చేస్తున్నారని సమాచారం. ఓ మహిళా జెడ్సీ అయితే ఇంకో రెండేళ్లలో సర్వీస్ పూర్తవుతుంది కాబట్టి.. ఎలాగైనా ఇక్కడ ఉండేందుకు స్థానిక నేతలతో పాటు విజయవాడ నుంచి కూడా లెటర్లు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు విజయవాడ వెళ్లి మంతనాలు చేయడం కొసమెరుపు. బదిలీలు జెడ్సీల్లో గుబులు పుట్టిస్తుంటే కూటమి ఎమ్మెల్యేలకు మాత్రం కాసుల పంట పండిస్తోంది.

ఏయూ రిజిస్ట్రార్‌గా ఇ.ఎన్.ధనుంజయరావు

- రెక్టార్‌గా ఎన్.కిశోర్‌బాబు
- సీడీసీ డీన్‌గా టి.వి.కృష్ణ
- అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్‌గా చల్లా రామకృష్ణ



ఏయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఇ.ఎన్.ధనుంజయరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా జియాలజీ విభాగం ఆచార్యులు ఇ.ఎన్.ధనుంజ రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు నుంచి ఉత్తర్వులు స్వీకరించారు. ఏయూ రెక్టార్‌గా ఇప్పటివరకు రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించిన ఎన్.కిశోర్‌బాబు నియమితులయ్యారు. అలాగే అకడమిక్ ఎఫైర్స్ డీన్‌గా ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డీన్‌గా ఆచార్య చల్లా రామకృష్ణ, సీడీసీ డీన్‌గా ఆచార్య టి.వి.కృష్ణ, స్టూడెంట్ అఫైర్స్ ఇంచార్జ్ డీన్‌గా డాక్టర్ జి.రాంబాబు, ఏఈఆర్‌సీ గౌరవ డైరెక్టర్‌గా డాక్టర్ బి.లిల్లీ గ్రేస్‌లను నియమించారు. అదే విధంగా కంప్యూటర్ సెంటర్ అసోసియేట్ డీన్‌గా డాక్టర్ కె.వెంకటరమణ, స్టూడెంట్ అఫైర్స్ అసోసియేట్ డీన్‌లుగా డాక్టర్ ఎస్.ఎం.యుగంధర్, డాక్టర్ ఎస్.హరనాథ్, గాంధీ అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా డి.రామారావు, ఐఏఎస్ఈ ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ డి.నాగ రాజకుమారిలు నియమితులయ్యారు.

రిజిస్ట్రార్‌గా ధనుంజయరావు బాధ్యతలు

ఏయూ రిజిస్ట్రార్‌గా ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు వర్సిటీ ఆచార్యులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ధనుంజయరావు ఏయూ అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్‌గా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. జియాలజీ విభాగం ఆచార్యుడిగా మూడు దశాబ్దాలకు పైగా సేవలు అందిస్తున్నారు. విభిన్న దేశాలకు చెందిన విద్యార్థులు ఏయూలో ఉన్నత విద్యను అభ్యసించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవడం, జాతీయ స్థాయిలో ఏయూ ఇమేజ్ పెంపొందించడంలో విశేష కృషి చేశారు. ఆయన చొరవతో ఏయూ వెయ్యి మందికి పైగా విదేశీ విద్యార్థులకు స్థానం కల్పించడం సాధ్యమైంది. ధనుంజయరావు గతంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా, ఇన్‌చార్జ్ వీసీగా పనిచేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఓషన్ డెవలప్‌మెంట్, ఓఎన్‌జీసీ, డీఎస్‌టీకి సంబంధించిన విభిన్న ప్రాజెక్టులను నిర్వహించారు.



కృష్ణం వందే జగద్గురుం

కృష్ణాష్టమి పర్వదినాన యదునందనుడి స్మరణలో విశాఖ పులకించింది. ఆలయాల్లో యశోదాతనయుడికి ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణుల వేషధారణలతో చిన్నారులు సందడి చేశారు. వివిధ పాఠశాలల్లో చిన్నారులు ఉట్టి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇస్కాన్ ఆలయంలో రాధాకృష్ణులను విశేషంగా అలంకరించారు. వేలాది మంది భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. 8లో

జిల్లా పరిషత్ సమీపాన గల కృష్ణ చైతన్య మఠంలో కొలువైన రాధాకృష్ణులు



శ్రీకృష్ణ విద్యామందిర్‌లో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు



పాత పెన్షన్ విధానం కోసం ఉద్యమిద్దాం

డాబాగార్డెన్స్: పాత పెన్షన్ విధానం, 8వ వేతన సంఘం ఏర్పాటుకు ఐక్యంగా ఉద్యమిద్దామని సిటూ అఖిల భారత కార్యదర్శి కేఎస్ ఉమేష్ పిలుపునిచ్చారు. డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ నేతృత్వంలో సోమవారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 8వ వేతన సంఘం ఏర్పాటు, ఓపీఎస్ సాధన కార్మిక వర్గ పాత్రపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఏకీకృత పెన్షన్ విధానంపై దేశంలోనే తొలిసారిగా సదస్సు నిర్వహించిన విశాఖపట్నం డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీని అభినందించారు. దేశంలో త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అక్కడ లబ్ధి పొందేందుకు ఏకీకృత పెన్షన్ విధానాన్ని ప్రకటించిందన్నారు. పెన్షన్ భిక్షం కాదని, కార్మికుల హక్కు అని సుప్రీం కోర్టు విశదీకరించిందని, 20 ఏళ్ల సుదీర్ఘ పోరాటాలు ఫలితంగా ప్రభుత్వంలో కదలిక వచ్చిందని ఏఐడీఇఎఫ్ మాజీ అదనపు కార్యదర్శి గుహతకుర్తా గుర్తు చేశారు. రైల్వే లోకో రన్నింగ్ స్టాఫ్ డివిజన్ కార్యదర్శి బోలే నాథ్ మాట్లాడుతూ ఏకీకృత పెన్షన్ మాకు ఆమోదయోగ్యం కాదన్నారు. రాష్ట్ర సిటూ ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, కాన్ఫడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.నాగేశ్వరరావు, టీఎన్టీయూసీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగార్జున, నేవల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, జి.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.73,040
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.66,950
వెండి(కిలో):	రూ.92,900

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.113
స్కిన్	: రూ.194
స్కిన్‌లెస్	: రూ.204

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	505.00
విజయనగరం	509.00
శ్రీకాకుళం	509.00



ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ

విమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. రాత్రి సమయంలో సెక్యూరిటీని పెంచడంతో పాటు సాయంత్రం 5 గంటల తర్వాత ప్రధాన ముఖద్వారం మినహా మిగిలిన అన్ని గేట్లను మూసివేస్తున్నాం. రాత్రి సమయంలో విధుల్లో ఉన్న సిబ్బందిపై రోగులు గానీ, వారి బంధువులు గానీ దాడులు చేయకుండా క్యాజువాలిటీ దగ్గర ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేశాం. ఉద్యోగుల భద్రత కోసం ముగ్గురు డాక్టర్లతో కమిటీని నియమించాం.

– డాక్టర్ కె.రాంబాబు, డైరెక్టర్, విమ్స్

చట్టాలు పటిష్ట పరచాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యోదంతం మానవత్వానికి మాయని మచ్చ. ఆధునిక సమాజంలో ఇదొక అత్యంత హేయమైన చర్య. మహిళలను దేవీరూపాలుగా పూజించే మన దేశంలో ఇటువంటి క్రూరమైన చర్యలు జరగడం దురదృష్టకరం. ఇంకొకరు ఇటువంటి ఘటనలను తలుచుకుంటేనే వణుకు పుట్టేలా నిందితులను శిక్షించాలి. చట్టాలను మరింత కఠినతరం చేయాలి. పనిచేసే ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులు కనీస సదుపాయాలు కల్పించాలి. రాత్రి విధులు నిర్వర్తించే వైద్యులకు, ఇతర మహిళా సిబ్బంది భద్రతపై దృష్టి సారించాలి.

– డాక్టర్ బి.ఎస్.చక్రవర్తి, పిల్లల వైద్య విభాగం హెచ్‌వోడీ, ఏఎంసీ

కృష్ణం వందే జగద్గురుం



ఇస్కాన్‌లో హారతి ఇస్తున్న మేయర్ హరివెంకట కుమారి దంపతులు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు



గోవర్ధన గిరిని చిటికెన వేలుతో ఎత్తుతున్న కృష్ణుడు వేషధారి



ద్వారకానగర్ శ్రీకృష్ణ విద్యా మందిరం వద్ద ఉట్టి కొడుతున్న చిన్నారులు

డాబాగార్డెన్స్: మహారాణిపేట జిల్లా పరిషత్ సమీపాన గల కృష్ణ చైతన్య మఠంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముఖ్యంగా పసిపిల్లల పాదాలకు పారాణి రాసి అడుగులతో ఇళ్లల్లోకి నడిపించి, చిన్ని కృష్ణుని ఆహ్వానించారు. పాతజైల్‌రోడ్డు కృష్ణుని మందిరం వద్ద నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ..

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్‌మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు రెండో రోజైన సోమవారం ఘనంగా జరిగాయి. మంగళహారతితో మొదలై సామూహిక హరినామ జపం కార్యక్రమాలు జరిగాయి. నితాయి సేవినీ మాతాజీ, ప్రజీ కృష్ణలీలల గురించి ప్రవచనాలు చేశారు. అనంతరం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. రాధా దామోదర విగ్రహాలకు బృందావనం నుంచి తీసుకువచ్చిన పట్టు వస్త్రాలు, వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన పుష్పాలతో అలంకరించగా వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఉట్టి ఉత్సవం, వేలాది మంది విద్యార్థులతో నృత్యపోటీలు నిర్వహించారు. 1008 దీపాలతో మహా హారతి నిర్వహించారు. జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తదితర ప్రముఖులు స్వామి దర్శనం చేసుకున్నారు. సాంబదాస్, వంశీకృష్ణ ప్రభు తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అలరించిన బాలగోకులం

సీతంపేట: బుల్లిబుల్లి అడుగులతో, బుంగమూతులతో శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు అలరించారు. సంస్కారభారతి ఆధ్వర్యంలో ద్వారకానగర్ శ్రీకృష్ణ విద్యామందిర్‌లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలగోకులం పేరిట జరిగిన శ్రీకృష్ణ వేషధారణ పోటీలో సుమారు 200 మంది చిన్నారులు పాల్గొని అలరించారు. నెలల శిశువు నుంచి 8 ఏళ్ల పిల్లలు ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బలరామకృష్ణులు, గోపికలు, రాధాకృష్ణులు వేషధారణతో ఆకట్టుకున్నారు. పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. భాగవతంలోని శ్రీకృష్ణుని ఆవిర్భావం, గోవర్ధనగిరి, జాంబవతి పరిణయం, పారిజాతాపహరణం వంటి ప్రముఖ ఘట్టాలను హైస్కూల్ విద్యార్థులు కళ్లకు కట్టినట్టు అద్భుతంగా ప్రదర్శించారు. వాటి విశేషాలను సందర్శకులకు వివరించారు.

కనుల పండుగగా శ్రీకృష్ణ జన్మాష్టమి

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో డాక్టర్ నిష్క్రించిన భక్తిదాస పర్యవేక్షణలో ఈ వేడుకలు జరుగుతున్న విషయం తెలిసిందే. గాదిరాజు ప్యాలెస్ వేసిన భారీ సెట్‌లో రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రారంభించారు. రాధాకృష్ణులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సప్తనదుల జలాలు, పంచామృతం, పండ్ల రసాలతో 108 పవిత్ర జల కలశాలతో అభిషేకం నిర్వహించారు. ఉయ్యాల సేవలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొన్నారు. 108 రకాల వంటకాలను శ్రీకృష్ణబలరాములకు నివేదించారు. సంగీత కళాకారులచే సామూహిక భజగోవిందం, 108 సార్లు హరినామ జపం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, కొయ్య ప్రసాదరెడ్డి, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.



ఘల్లు ఘల్లుమను మువ్వ సవ్వడుల ముద్దు బాలుడెవరే
వెన్న కొల్ల గొను కృష్ణ పాదముల ఆనవాలు కనరే
గోకుల కృష్ణా గోపాల కృష్ణా మాయలు చాలయ్యా
మా కన్నులలో దీపాలు వెలిగే పండుగ తేవయ్యా
పదుగురి నిందలతో పలుచన కాకయ్యా
నిలవని అడుగులతో పరుగులు చాలయ్యా
జయ కృష్ణ కృష్ణ కృష్ణ కృష్ణ కృష్ణ హరే





శ్రీకృష్ణ చైతన్య మఠంలో వద్ద భక్తుల క్యూ



చైతన్య మఠంలో చిన్నారుల సంకీర్తన



చిన్నికృష్ణుల ముచ్చట్లు

రూ.కోటి నష్టపరిహారానికి డిమాండ్

- ఎస్ఈజెడ్‌లోని సినర్జిన్ ప్రమాదంలో సూర్యనారాయణ మృతి
- బంధువులు, సీఐటీయూ నేతల ఆధ్వర్యంలో ఇండస్ ఆస్పత్రి వద్ద ఆందోళన



ఇండస్ ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు, సీఐటీయూ నేతలు

మహారాణిపేట: ఫార్మాసిటీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని, ప్రధానమంత్రి ప్రకటించిన రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతూ మృతుడు సూర్యనారాయణ బంధువులు, సీఐటీయూ నేతలు సోమవారం ఆందోళనకు దిగారు. జగదాంబ జంక్షన్ పరిధిలోని ఇండస్ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఫార్మాసిటీలో జరుగుతున్న వరుస ప్రమాదాలన్నీ యాజమాన్యం హత్యలేనని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ విమర్శించారు. ఈ నెల 22న రాత్రి పరవాడ ఎస్ఈజెడ్‌లోని సినర్జిన్ కంపెనీలో రియాక్టర్ పేలి నలుగురు కార్మికులు 60 శాతం పైబడి తీవ్రగాయాలతో ఇండస్ హాస్పటల్‌లో చేరారు. వీరిలో ముగ్గురు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వారు కాగా, విజయనగరానికి చెందిన సూర్యనారాయణ కూడా ఉన్నారు. ఇప్పటికే జార్ఖండ్‌కు చెందిన కార్మికుడు మృతి చెందగా..సోమవారం సూర్యనారాయణ కూడా మృతి చెందాడు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు పిల్లలున్నారు. అచ్యుతాపురంలోని ఎసైన్షియా ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు చెల్లించిన విధంగానే వీరికి కూడా రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని బంధువులతో కలిసి సీఐటీయూ నేతలు కుమార్, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఫార్మా సిటీ ఎంప్లాయీస్ యూనియన్స్ కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణలు ఆందోళన నిర్వహించారు. ఇదిలావుండగా అంత్యక్రియల కోసం రూ.20వేలు, సూర్యనారాయణ మృతదేహాన్ని విజయనగరం తరలించేందుకు అంబులెన్స్‌ను ఎస్ఈజెడ్‌లోని సినర్జిన్ యాజమాన్యం ఏర్పాటు చేసింది.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



లక్ష్మీ సుజాత (ఫైల్)

కొమ్మాది: విద్యుత్ షాక్‌తో ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఎండాడలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రాజీవ్ నగర్‌లో గూడుపల్లి శ్రీనివాసరావు, ఆయన భార్య లక్ష్మీ సుజాత, కుమారుడు చరణ్‌తో కలసి నివాసం ఉంటున్నారు. లక్ష్మీ సుజాత సోమవారం ఇంటి ముందు పువ్వులు కోస్తుండగా మొక్కలకు ఆనుకుని ఉన్న విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆదివారం తన ఇంటి పక్కనే ఉన్న పాత భవనాన్ని ఓ వ్యక్తి జేసీబీ ద్వారా కూల్చివేశారు. ఈ క్రమంలో భూగర్భంలో ఉన్న విద్యుత్ ప్రవహించే అధిక ఓల్టేజ్ తీగలు తొలగించారు. ఇవి శ్రీనివాస్ పూల మొక్కలపై పడిపోయాయి. ఇది గమనించని లక్ష్మీసుజాత పువ్వులు కోసే క్రమంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. అధికారుల నిర్లక్ష్య ధోరణి, ఇంటి యజమాని చేసిన తప్పిదం తన భార్య ప్రాణాలు తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిపై చర్యలు తీసుకోవాలని ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మురుగో..మురుగు

బీచ్‌రోడ్డు: నగరంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి డ్రైనేజీలు పొంగి పొర్లాయి. దీంతో మురుగు మొత్తం రోడ్డుపైకి రావడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఫిషింగ్ హార్బర్ నుంచి కోస్టల్ బ్యాటరీవైపునకు భారీగా మురుగు చేరింది. సమాచారం అందుకున్న జీవీఎంసీ సిబ్బంది డ్రైనేజీ ఓపెన్ చేసి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు.





ఫిషింగ్ హార్బర్ నుంచి కోస్టల్ బ్యాటరీవైపునకు వెళ్లే మార్గంలో డ్రైనేజీ నుంచి పొంగిపొర్లుతున్న మురుగు